

బృహత్ ప్రకృతి వనంలో
చెట్ల నరికివేత 6
10 ఎకరాల్లో మొక్కలన్నీ నేలమట్టం
మైల్వార్ శివారులో ఘటన
భూమి తమదంటూ మహిళ ఆక్రమణ

ఘనంగా నాగుల పంచమి



తాండూరు రూరల్: తాండూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పుట్టకు పాలు పోస్తున్న మహిళలు

జిల్లా వ్యాప్తంగా నాగుల పంచమిని వైభవంగా జరుపుకున్నారు. ఆలయాలను మంగళవారం శోభాయమానంగా అలంకరించారు. వేకువజాము నుంచే మహిళలు ఆలయాల వద్దకు బారులుతీరారు. పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని నాగ దేవతను వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద సందడి నెలకొంది.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్
జూలై 29



వికారాబాద్ పట్టణంలో..



కీసరగుట్టలోని నాగదేవత అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ఆయిల్‌పామ్ మొక్క నాటి నీరుపోస్తున్న మంత్రి తుమ్మల, స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ అగ్రస్థానం

రైతులకు మేలు రకం మొక్కలు అందించాలి

దక్షిణ భారత నేలలు ఈ సాగుకు అనుకూలం

వచ్చే ఏడాది వికారాబాద్‌లో పామాయిల్ పరిశ్రమ

మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వికారాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, రైతులు ఈ సాగును ఎంచుకుని లాభాల బాటలో ముందుకు సాగాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మెగా పామాయిల్ ప్లాంటేషన్‌లో భాగంగా మంగళవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలో కొత్రేపల్లిలో రంగారెడ్డి జిల్లా పరిషత్తు మాజీ ఛైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ వ్యవసాయ క్షేత్రంలో



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదెకరాల్లో పత్తి సాగు కంటే ఒక ఎకరా పామాయిల్ సాగు చేయడం ఎంతో లాభమన్నారు. రైతుల సంక్షేమం కోసం ఉద్యానవన శాఖ అధికారులు నాణ్యత కలిగి అధిక దిగుబడి ఇచ్చే మేలు రకమైన మొక్కలను రైతులకు అందించేందుకు కృషి చేయాలన్నారు. సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు మొక్కలతో పాటు డ్రిప్ సదుపాయం కల్పించాలన్నారు.

కూరగాయల సాగు పెంచాలి

దక్షిణ భారత దేశం ఆయిల్ ఫామింగ్‌కు ఎంతో అనువైందన్నారు. మంచి ధర అందించి రైతులను ప్రోత్సహించాలని కోరుతూ త్వరలో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులందరూ కలిసి ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆయిల్ ఫామింగ్ 31 జిల్లాల్లో కొనసాగుతోందని, రంగారెడ్డి జిల్లాలోనే ఈ సాగు కొంత ఆలస్యమైందని చెప్పారు. ఈ మొక్కలను ఒక్కసారి నాటితే 40 సంవత్సరాల వరకు

మిగతా 7వ పేజీలో...

'కాగ్నా'పై ఎత్తిపోతలు

చిలుక వాగు ప్రక్షాళనకు ప్రత్యేక నిధులు



బహిరంగ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, వేదికపై చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు

ఈ జిల్లావాసిగా అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి

1,37,599 కనెక్షన్లకు 200 యూనిట్ల ఉచిత కరెంటు

తాండూరు బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

జుంటుపల్లి, దౌలాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కాగ్నా నది నీరు వృథాగా పోకుండా లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. తాండూరు నియోజకవర్గంలోని యాలాల మండలం జుంటుపల్లి, దౌలాపూర్, తాండూరు పట్టణంలో మంగళవారం రూ.230 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే లబ్ధిదారులకు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.

తాండూరు/యాలాల/ పెద్దేముల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణాన్ని వరద నీటితో ముంచుతున్న చిలుక వాగు ప్రక్షాళనకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరిక మేరకు ప్రత్యేక నిధులు కేటాయిస్తానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గేమ్ చేంజర్ లా మార్చేందుకు ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాండూరు ప్రాంతం నుంచి ప్రముఖులైన మర్రి చెన్నారెడ్డి, మాణిక్‌రావు, చంద్రశేఖర్ వంటి నాయకులు ప్రాతినిధ్యం వహించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమగ్ర ప్రణాళిక తయారు చేసుకొని నిరంతరం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో

మిగతా 7వ పేజీలో...



ప్రత్యేక నిధులు కేటాయించాలి: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి డిప్యూటీ సీఎంను కోరారు. ఆయన మాట్లాడుతూ తాండూరులో బైపాస్ రోడ్డు, పారిశ్రామికవాడల సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో మరో రెండు విద్యుత్ సబ్ స్టేషన్‌లను మంజూరు చేయాలన్నారు. చిలుకవాగు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ని ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం మంజూరు చేయడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తాండూరుకు ప్రత్యేకత ఉంది

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే తాండూరుకు ప్రత్యేక స్థానం ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గుర్తు అన్నారు. ఆయన మాట్లాడుతూ రాజకీయంగానే కాకుండా తాండూరు నాపరాయి ప్రపంచంలోనే గుర్తింపు పొందిందన్నారు. బీఆర్ఎస్ వాళ్లు ఉచిత బస్సును రద్దు చేయాలని కోరుతున్నారని మండిపడ్డారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకున్నా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. సొంత జిల్లా కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందన్నారు.



భట్టి విక్రమార్కకు చిన్ననాటి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆయన స్నేహితుడు రవీందర్‌రావు

నువ్వెంతంటే నువ్వెంత?

» స్పీకర్ సమక్షంలోనే నేతల రగడ

వికారాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పటణానికి చెందిన ఇద్దరు కాంగ్రెస్ ప్రధాన నాయకులు మంత్రి తుమ్మల, స్పీకర్ ఎదుటే గొడవకు దిగడం చర్చనీయాంశంగా మారింది. మాట మాట పెరిగి గొడవ పెద్దగా మారడంతో బాహాబాహీ వరకు వెళ్లింది. ఈ సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వికారాబాద్ పట్టణంలో పామాయిల్ ప్లాంటేషన్ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. సభా వేదిక వద్ద పట్టణానికి చెందిన నాయకులు సుధాకర్‌రెడ్డి, చిగుళ్లపల్లి రమేశ్ చిన్నగా మాట్లాడుకుంటూనే ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు. ఇద్దరూ నువ్వెంతంటే నువ్వెంత? అన్నట్లుగా మాట్లాడుకోవడంతో కొంత సమయం సమావేశం రసాభాసగా మారింది. దీంతో నేతలు సముదాయించడంతో శాంతించారు. ఏదేమైనా ఇద్దరి మధ్య దూరం స్పష్టంగా కన్పించిందని, ఇది వర్గా విభేదాలకు దారి తీస్తుందని స్థానిక నేతలు పేర్కొంటున్నారు.



సమావేశంలో కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

వైభవంగా రంగనాయకస్వామి రథోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, జూలై29(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్‌లోని శ్రీ గోదా సమేత మన్నార్ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం దివ్య విమాన రథోత్సవ ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి రథాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, అరటి కొమ్మలతో సుందరంగా ముస్తాబు చేశారు. స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, హరివర్ధన్‌రెడ్డిలు దివ్యవిమాన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథాన్ని ముందుకు లాగి వేడుకలను ప్రారంభించారు. భక్తుల కోలాహలంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసింది. గోవింద నామస్మరణతో మారుమోగింది. కేరళ వాయిద్యాలతో భక్తులు నృత్యాలు అలరించాయి. ఊరేగింపు గ్రామప్రధాన చౌరస్తా వరకు సాగింది. భక్తులు రథం వద్దకు వచ్చి కొబ్బరికాయలు, పూలు సమర్పించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాయకులు వేముల మహేశ్‌గౌడ్, కందుల కుమార్, గాయరు విశ్వనాథం, రామోజీ, ధర్మారెడ్డి, మెట్టు రమేష్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, గొంగళ్ల బాలేష్, సావల్ సురేష్, కంట్లం ఓం ప్రకాశ్, రాజేందర్‌గౌడ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



రంగనాయకస్వామి రథోత్సవంలో భక్తుల కోలాహలం



నవోదయ విద్యాలయ పనులను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ మను చౌదరి

మెరుగైన వైద్య సేవలు అందించాలి

» మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి

కీసర, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి కావాల్సిన అవసరాల గూర్చి వైద్యాధికారి మనుజారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పురాతన భవనం కావడంతో వర్షపు నీరు కురువకుండా పైన షెడ్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోజువారీగా ఎంత మంది ఇన్ పేషంట్లు వస్తారని, నెలవారీగా ప్రసూతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత ఏమైనా ఉందా ఎలాంటి మౌలిక వసతులు కావాలన్నా వివరాలు పంపండి నిధులు కేటాయిస్తామన్నారు. అనంతరం త్వరలో ప్రారంభం కానున్న జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి, తహసీల్దార్ అశోక్, లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు కాంగ్రెస్

పాదయాత్రకు హాజరుకానున్న మీనాక్షినటరాజన్, మహేశ్‌గౌడ్

పరిగి నియోజకవర్గం నుంచి పాదయాత్ర ప్రారంభం

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



పరిగిలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూలై 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు 'ప్రజల వద్దకు కాంగ్రెస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీపీసీసీ ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఉమ్మడి జిల్లాల వారీగా చేపట్టిన కార్యక్రమాన్ని రాష్ట్రంలో మొదటగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నిర్వహించేందుకు టీపీసీసీ నిర్ణయించింది. ఇందుకు పరిగి అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకుంది. 31న గురువారం పరిగి మండలం రంగాపూర్ గ్రామంలో ఈ పాదయాత్రను శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొంటున్నారు. 31న గురువారం సాయంత్రం పరిగి మండలం రంగాపూర్ వద్దకు చేరుకుంటారు. అక్కడ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలుకుతారు. రంగాపూర్ నుంచి పరిగి పట్టణంలోని

మిగతా 8వ పేజీలో...


కర పత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

ఘట్‌కేసర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు నిరంతరం పోరాటాలు సాగిస్తున్నారని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర అన్నారు. ఆగస్టు 19 నుంచి 22 వరకు కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో జరిగే సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలపై ప్రచారాన్ని మంగళవారం ఘట్‌కేసర్‌లో ఆ యన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో నియంతృత్వం మితిమీరిపోతోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నారని వాపోయారు. స్వతంత్ర వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం తన గుప్పిట్లో పెట్టుకొని రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందని మండిపడ్డాడు. సీపీఐ భవిష్యత్ కార్యచరణపై మహాసభల్లో చర్చిస్తారని తెలిపారు. మహా సభల విజయవంతానికి ప్రజలు, వ్యాపారులు విరాళాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో సత్యప్రసాద్, జయచంద్ర, ఈశ్వర్, శివ పాల్గొన్నారు.

బృహత్ ప్రకృతి వనంలో చెట్ల నరికివేత

- పదెకరాల్లో మొక్కలన్నీ నేలమట్టం
- మైల్వార్ శివారులో ఘటన
- భూమి తమదంటూ మహిళ ఆక్రమణ
- పోలీసులకు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు


మొక్కలను నరికివేయడంతో మైదానంలా మారిన మైల్వార్ పల్లె ప్రకృతి వనం


నరికివేసిన చెట్లతో వేసుకున్న గుడిసె

బషీరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల కిందట ప్రభుత్వం బృహత్ పల్లె ప్రకృతి వనంలో నాటిన వేలాది చెట్లు నెలమట్టమయ్యాయి. ఓ కుటుంబం ఆ భూమి తమదంటూ ప్రభుత్వ భూమిలో చెట్లను నరికివేయించడంపై గ్రామంలో చర్చనీయాంశమైంది. ఆ స్థలంలో పంట సాగు చేస్తోంటే అధికారులేం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి నర్సింహగౌడ్ పోలీసులకు ఫిర్యాదుతో ఈ విషయం మంగళవారం వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మైల్వార్ శివారు అటవీ ప్రాంత సర్వే నంబరు 235లో పది ఎకరాలను 2022లో రెవెన్యూ అధికారులు బృహత్ పల్లె పకృతి వనం కోసమని పంచాయతీకి కేటాయించారు. ఈ స్థలంలో ఉపాధి హామీ పథకం కింద 18వేలకుపైగా వివిధ రకాల మొక్కలను నాటారు. వాటిని పెంచేందుకు ఇప్పటి రూ.లక్షల్లో వ్యయం చేశారు. సామగ్రికి సైతం నిధులు వెచ్చించారు. కాగా బృహత్ ప్రకృతి వనం భూమి మాదంటూ మైల్వార్‌కు చెందిన మెతుకు బసమ్మ అనే మహిళ చెట్లను కూలీలతో నరికివేయించింది. ఆ భూమి అటవీ ప్రాంతంలో ఊరి చివర ఉండడంతో మొదట గ్రామస్తులు గుర్తించలేదు. ఇది కొన్ని రోజులుగా జరుతోంది. నాలుగు రోజుల కింద గ్రామస్తుల సమాచారంతో పంచాయతీ కార్యదర్శి నర్సింహగౌడ్ అక్కడికి వెళ్లి చూడగా చెట్లన్నీ నరికేయడం చూసి ఖంగుతిన్నాడు. ప్రభుత్వ భూమిలో చెట్లు నరికి పంట ఎలా వేస్తారని అక్కడున్న మహిళను ప్రశ్నించారు. 'ఈ భూమి మాది. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో.' అంటూ సదరు మహిళ విరుచుకుపడిందని కార్యదర్శి వాపోయాడు. పూర్వీకులనుంచి ఈ భూమి తమదని కార్యదర్శిపై మండిపడ్డారు. దీంతో సెక్రటరీ వెంటనే ఎంపీడీవో తిరుమలస్వామి, ఎంపీవో విజయ్‌కుమార్‌లకు సమాచారం ఇచ్చాడు. అయితే అధికారులెవరూ క్షేత్రస్థాయికి రాలేదని, వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే ఎంపీడీవో ఆఫీసులో ప్రకృతి వనం భూమి పత్రాలు దొరకక అధికారులు తల పట్టుకుంటున్నారు. కాగా చెట్లు నరికి, భూ ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు చేశామని పంచాయతీ కార్యదర్శి చెప్పారు.


చెట్ల నరికివేతకు ముందు బృహత్ పల్లె ప్రకృతి వనం(ఫైల్)

రోడ్డు కోసం తహసీల్దార్‌కు వినతి

రంగారెడ్డి అర్బన్/శంకర్‌పల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మండలం సింగాపురం పరిధి సర్వే నంబర్ 51లోని వెంచర్‌కు వెళ్లేందుకు 30 అడుగుల దారి ఇప్పించాలని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ(మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్) ఉద్యోగులు మంగళవారం శంకర్‌పల్లి తహసీల్దార్‌ను కోరారు. 1990లో సింగాపురం సర్వే నంబర్ 51లో 3.8గుంటల భూమిని కె.మాణిక్యమ్మ వద్ద కొని 1992లో 58ప్లాట్లుగా లేఅవుట్ చేశామని చెప్పారు. సంగారెడ్డి-శంకర్‌పల్లి మెయిన్ రోడ్డు నుంచి తమ వెంచరుకు వెళ్లేందుకు 30ఫీట్ల రోడ్డు ఉందని తెలిపారు. ఆ రోడ్డును అక్రమించారని చెప్పారు. సర్వే నంబర్ 51, 52లోని ప్లాట్ల యజమానులంతా ఎల్ఆర్ఎస్ కట్టారన్నారు. వెంచర్‌కు ఉత్తరం, పడమర, దక్షిణాల్లోని భూమిలో పాట్లుగా చేసి ప్రహరీ నిర్మించినట్లు చెప్పారు. దక్షిణం వైపు ప్రహరీ కారణంగా 51 సర్వే నంబర్ లోని కొంత భూమి ఆక్రమణకు గురైనట్లు తెలిపారు. ఆక్రమదారులపై చర్యలు తీసుకుని వెంచర్‌కు దారి ఇప్పించాలని కోరారు. తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎంఈవీ.ప్రసాద్, వైస్‌ప్రెసిడెంట్ బి.శ్రీనివాస్, కార్యదర్శి ఎం.అర్జున్, జాయింట్ సెక్రటరీ సురేష్, కోశాధికారి ప్రతాప్‌రాజు తదితరులు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


వాహనంలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా అధికారులు

మోమిన్‌పేట్, జూలై 29(ఆంధ్రజ్యోతి): 102, 108 వాహనాల సిబ్బంది ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉండాలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మోమిన్ పేట్‌లో 102, 108 వాహనాలను జిల్లా సూపర్‌వైజర్ అబ్దుల్ రహీంతో కలిసి తనిఖీ చేశారు. అత్యవసర సేవలు 102, 108 వాహనాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. వాహనాల్లో రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. సందర్భంగా ల్యాబ్ టెక్నిషియన్ నవీన్‌కుమార్, పైలెట్ మహ్మద్ జావీద్, కెప్టెన్ తాజుద్దీన్ ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మున్సిపల్ కమిషనర్

కొడంగల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ బల్‌రాంనాయక్ అన్నారు. మంగళవారం జెడ్పీ బాలుర పాఠశాలను సందర్శించారు. పాఠశాల వంట గది, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. ఏవైనా సమస్యలున్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్

ఇబ్రహీంపట్నం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలాధ్యక్షుడు గోదల శేఖర్‌రెడ్డి అధ్యక్షతన వైష్ణవి గార్డెన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక ఎంపీటీసీ స్థానాలు కైవసం చేసుకొని ఎంపీపీ, జెడ్పీటీసీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. జిల్లాలో అత్యధిక జెడ్పీటీసీ స్థానాలు గెలుస్తే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి సైతం దక్కుతుందన్నారు. నాయకులు క్షేత్రస్థాయిలో పని చేసి కేంద్ర ప్రభుత్వం పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బూత్ కమిటీలతో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, పోరెడ్డి అర్జున్ రెడ్డి, బోసుపల్లి ప్రతాప్, దయానంద్‌గౌడ్, భోజిరెడ్డి, భాస్కర్, నాయిని సత్యనారాయణ, గణేష్, బూత్ స్థాయి అధ్యక్షులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ జెండా ఎగరాలి

- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి

మంచాల, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీజేపీ జెండా ఎగరాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చాడు. పార్టీ మండలాధ్యక్షుడు నూకం రాజు అధ్యతన మంగళవారం మంచాలలో మండల నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. హాజరైన లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. గ్యారెంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో నాటకానికి తెరతీశారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకూ తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వి.వెంకట్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ డి.బాషయ్య, ఎం.శ్రీశైలం, జంగయ్యగౌడ్, రాజు, జనార్ధన్‌రెడ్డి, రమేష్, బిక్షపతి, గౌర వెంకటేశ్, కె.వెంకట్‌రెడ్డి, మండల నాయకులు వి.జగదీశ్వర్ రెడ్డి, రాజుగౌడ్, పాండు, ఐలయ్య, పూర్ణచందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు లచ్చిరెడ్డి

మోడల్ స్కూళ్లు, కళాశాలల్లో నాణ్యమైన విద్య



నేదునూరు ఆదర్శ పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

కందుకూరు. జులై 29(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమై విద్యను అందించడంలో మోడల్ పాఠశాలలు, కళాశాలలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని టీచర్స్ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ఐదో వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్ పీఎంశ్రీ స్కూల్‌కు ఎంపికైయింది. మంగళవారం పాఠశాలలో పీఎం శ్రీ పాఠశాల శిలాఫలకాన్ని మోడల్ స్కూల్స్ కాలేజీల అదనపు డైరెక్టర్ శ్రీనివాసచార్యులు, ఏఎంవో జయచంద్ర, ఎంఈవో నర్సింహలతో కలిసి ఎమ్మెల్సీ ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ఉత్తమ ఫలితాలు తెచ్చిన ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, ఉపాధ్యాయులను అభినందించారు. ఏడీ శ్రీనివాసచార్యులు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి ఆదర్శవంతంగా ఎదగాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ నేదునూరు ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విష్ణుప్రియ. ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసశర్మ, అధ్యాపకులు సురేష్, కృష్ణ, గ్లోరీ, కౌసల్య, ఎండి బషీర్, శాంతికుమారి, కరుణాకర్, అబ్దుల్లా, శ్రీవాణి, గిరిజ, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి


అకులమైలారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో ప్రవీణ్‌కుమార్

కందుకూరు,జులై29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదిక తెప్పించుకొని అమలు చేయాలని రాష్ట్ర ఉపాధ్యా సంఘం(ఎస్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు పి.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మీర్కాన్‌పేట, ఆకులమైలారం, మాదాపురం, గుమ్మడవెల్లి, కందుకూరు, గూడూరు, ముచ్చర్ల ఉన్నత పాఠశాలలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొని సమస్యలపై స్కూళ్ల ఉపాధ్యాయులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమొచ్చి ఏడాదిన్నరయిందని, ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా నూతన పీఆర్సీ, పెండింగ్ డీఏలు, ఆరోగ్య కార్డులను అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవోపై ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. టీచర్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వహామీ మేరకు ప్రతీ నెల రూ. 7,010కోట్ల నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు ఏవీ.సుధాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేష్, యూనియన్ మండల నాయకులు రాజుగౌడ్, శ్రీనివాస్‌నాయక్, రమేశ్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి పదోన్నతి

డిప్యూటీ కలెక్టర్‌గా ప్రభుత్వ ఉత్తర్వులు

కందుకూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పలువురు ఆర్డీవోలకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగానే కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి రావడం పట్ల జగదీశ్వర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కందుకూరు రెవెన్యూ డివిజన్ అధికారులు, సిబ్బంది జగదీశ్వర్‌రెడ్డిని శాలువతో మనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజు, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ అగ్రస్థానం

(బిదో పేజీ తరువాయి)

దిగుబడి ఇస్తుందన్నారు. ఎకరా సాగు చేసే రైతులకు నాటిన నాలుగేళ్ల వరకు ప్రభుత్వం రూ.51,918 సబ్సిడీ అందిస్తోందన్నారు. కంపెనీ నిర్వాహకులే రైతుల వద్దకు వచ్చి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తారన్నారు. వచ్చే ఏడాది వికారాబాద్‌లో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్నారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు వచ్చే ఐదేళ్లలో రాష్ట్రం పచ్చబడు తుందన్నారు. హైదరాబాద్ మహానగరానికి అవసరమైన కూరగాయలు ఇక్కడి నుంచే అందే విధంగా జిల్లాలో వివిధ కూరగాయల సాగు పెంచాలని ఆయన రైతులకు సూచించారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాముఖ్యత

గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగునీరు అందించే పథకాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విమర్శించారు. ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల పనులకు నిధులు ఇవ్వలేదన్నారు. ప్రాణహిత చేవెళ్ల పథకం గురించి తాను సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడానని, ఈ పథకం ద్వారా వచ్చే ఆయిదేళ్లలో మన ప్రాంతానికి సాగునీరు అందుతుందని హామీ ఇస్తున్నానని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే వ్యవసాయ రంగానికి రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. జిల్లా భూములు పామాయిల్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని, ఒక ఎకరా వరి పండించేందుకు నీటితో నాలుగు ఎకరాల పామాయిల్ తోటలు సాగు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్, పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ హస్మీన్ బాషా, డిప్యూటీ డైరెక్టర్ నీరజా గాంధీ, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి సత్తార్, వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, ఆర్డీవో వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు కిషన్ నాయక్, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, అనంత్‌రెడ్డి, రాందయర్‌రెడ్డి, సతీష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి

శంకర్‌పల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి కోరారు. శంకర్‌పల్లి, జన్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, శంకర్‌పల్లి, టంగుటూరు ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని సెప్టెంబర్ 1న ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుల బెనిఫిట్స్‌ను వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులను సైతం మంజూరు చేయాలని, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు మాణిక్యం, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాములు, సంజీవరావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యాయురాలు రమ తదితరులు ఉన్నారు.

భర్త నాటిన మొక్కకు పూజలు

యేటా పతి దేవుడి జయంతి వేడుక



తాండూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): తన భర్త నాటిన మొక్కను పెంచుతూ ఆ చెట్టులోనే జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ యేటా భర్త జయంతి రోజున వేడుకను నిర్వహిస్తున్నారు తాండూరు మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి. తాండూరుకు చెందిన వ్యాపారి లయన్స్ క్లబ్ సేవారత్న అవార్డ్ కోట్రిక వెంకటయ్య 2016 జూలైలో తన ఇంటి ముందు ఓ మొక్క నాటారు. కాగా 2017 ఏప్రిల్‌లో అనారోగ్యంతో ఆయన మృతిచెందారు. భర్త నాటిన మొక్కను విజయలక్ష్మి అపురూపంగా పెంచి యేటా తన పతిదేవుడి జయంతి వేడుక నిర్వహిస్తున్నారు. రోడ్డు విస్తరణలో మొక్కను తొలగించాల్సి రాగా వేళ్లతోసహా పెకిలించి చెట్టును తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శాశ్వతంగా ఉనుమతితో నాటించారు. యేటా చెట్టును బెలూన్లు, పూలతో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం సైతం వెంకటయ్య జయంతిని, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ సుధారాణి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శరణు బసప్ప పాల్గొన్నారు.

కుల్కచర్ల ఎంఈవోను సస్పెండ్ చేయాలి

వికారాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కుల్కచర్ల ఎంఈవో హబీబ్ అహ్మద్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కొన్ని ఉపాధ్యాయ సంఘాలకు ఎంఈవో ఏజెంటుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఒక సంఘం సభ్యత్వ క్యాంప్‌లో పాల్గొన్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న హబీబ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని కలెక్టర్, డీఈవో, రీజనల్ డైరెక్టర్లకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

పరిశ్రమలో పేలిన సేఫ్టీ వాల్

కార్మికులకు త్రుటిలో తప్పిన ముప్పు

మేడ్చల్ టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో యంత్రానికి అమర్చిన సేఫ్టీవాల్ పేలింది. త్రుటిలో కార్మికులకు ప్రమాదం తప్పింది. పెద్ద శబ్దంతో పరిశ్రమ పరిసరాలు దద్దరిల్లాయి. 20మంది కార్మికులకు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మేడ్చల్ పరిధి ఎస్ఆర్ఎస్ సైపుల పరిశ్రమలో 'సేఫ్టీ వాల్' పేలింది. పేలుడు సంభవించిన ప్రాంతం ధ్వంసమైంది. కార్మికులు 'సేఫ్టీ వాల్'కు దూరంలో ఉండటంతో సురక్షితంగా బయటపడ్డారు.

రిసార్ట్‌లో సినీ నటి కల్పిక హంగామా

మొయినాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): సినీ నటి కల్పిక మొయినాబాద్ మండలం కనకమామిడి బ్రౌన్‌టౌన్ రిసార్ట్‌లో హంగామా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. రిసార్ట్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కనకమామిడి పరిధి మిడి బ్రౌన్ టౌన్ రిసార్ట్‌కు నటి కల్పిక హైదరాబాద్ నుంచి క్యాబ్‌లో ఒంటరిగా వచ్చారు. ఆమె రూమ్‌లో దిగిన కాసేపటికి రిసెప్షన్ మేనేజర్ కృష్ణపై దురుసుగా ప్రవర్తించారు. మెనూ కార్డు, రూమ్ తాళాలు ముఖంపై విసిరేసి బూతులు తిట్టారు. సిగిరెట్ కావాలని సిబ్బందిపై మండిపడ్డారు. దీంతో పోలీసులకు సమాచారమిచ్చామని నిర్వాహకులు తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని ఓ పబ్‌లోనూ ఇటీవల కల్పిక గొడవకు దిగిన ఘటన వివాదానికి కారణమైంది. ఇదిలా ఉంటే ఈ ఘటనపై కల్పిక స్పందిస్తూ.. రిసార్ట్‌లో క్యాబ్ లేదని, వైఫై పెనిలిటీలు లేవన్నారు. సిగిరెట్ తెమ్మంటే తేలేదన్నారు. సర్వీసు విషయంలో సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా స్పందించకపోవడంతోనే తాను తిట్టానని తెలిపారు. బ్రౌన్ టౌన్ రిసార్ట్ సిబ్బంది తన పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా గరుడ పంచమి ఉత్సవం



ఉత్సవంలో ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో మంగళవారం గరుడ పంచమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో స్థానిక శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట ఉన్న ఏకశిల ఆంజనేయ స్వామితోపాటు గరుత్మంతుడికి పూజలు చేశారు. పంచామృతంతో అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసాచార్యులు గరుత్మంతుడికి, ఆంజనేయస్వామికి నూతన వస్త్రాలు, పూలు అలంకరించి నైవేద్యం సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వం, పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్‌గుప్త, వరిగి వెంకటసుబ్బారెడ్డి, గుఖాడ నర్సింహులు, కొట్ల రాజు, ఒగ్గు కిషోర్, ప్రతాప్‌రెడ్డి, కానుగు అంతయ్య, లింగారం కుమార్‌గౌడ్, చెన్నయ్య కృష్ణారెడ్డి, రఘునాయక్, శ్రీనివాస్‌యాదవ్, బస్వం, రాంపాల్, నర్సింహులు పాల్గొన్నారు.

'కాగ్నా'పై ఎత్తిపోతలు

(బిదో పేజీ తరువాయి)

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లు, రేషన్ కార్డులు, ఉద్యోగాలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2.10 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా 1,37,599 కనెక్షన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే బిల్లు పాస్ చేయాలని డిమాండ్ చేశారు. బషీరాబాద్ మండలం నవాంద్గికి 132 సబ్ స్టేషన్, తాండూరు నియోజకవర్గానికి 50 ట్రాన్స్‌ఫార్మర్లు వెంటనే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా అయిన వికారాబాద్ అభివృద్ధి గురించి ఆయన ఆలోచన చేస్తున్నారని అన్నారు. **కాగా, తాండూరు నియోజకవర్గంలో పర్యటించిన డిప్యూటీ సీఎంకు నిరసన సెగ తగిలింది. కాగ్నా నది పైపులైన్‌పై రంధ్రం పడటంతో మరమ్మతులు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు కొడంగల్ మీదుగా జుంటుపల్లికి వెళ్తుండగా భట్టిని అడ్డుకునేందుకు యత్నించారు. ఆందోళనకారులను పోలీసులు కొడంగల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలి పెట్టారు.** కార్యక్రమంలో ఆర్యవైశ్య ఫెడరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రమేష్, టీజీసీసీ ప్రధాన కార్యదర్శి దారాసింగ్, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, హబీబ్ లాల, డాక్టర్ సంపత్ కుమార్, పట్లోళ్ల నర్సిములు, నర్సిరెడ్డి, మాధవి, శోభరాణి, కౌన్సిలర్ ప్రభావతి, నీరజ, మమతా, పేరి రాజేందర్ రెడ్డి, హస్నంత, అక్బర్ బాబా, భీమయ్య, యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, అగ్గనూర్ భీమయ్య, ఎంపీడీఓ, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన కలెక్టర్, ఎస్పీ

మంగళహారతులతో స్వాగతం

తాండూరుకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబులకు పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గాజుల మాధవి, మాజీ కౌన్సిలర్ నీరజ బాల్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు శోభరాణి, మమత, సుమిత్ర, కౌన్సిలర్ ప్రభావతి, విజయ దేవి తదితరులు మంగళ హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశ మందిరం ముగింపు సమయంలో జాతీయ గీతం ఆలపించేలా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేసేలా చూడాలని పెద్దేముల్ మండలం మాజీ ఎంపీటీసీ విద్యాసాగర్ వినతిపత్రం అందజేశారు. అలాగే విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరుతూ బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ, నాయకులు వినోద్ కుమార్, చంద్రకాంత్ రెడ్డి, విక్రాంత్, షోయాబ్, కాసిల్ భట్టి విక్రమార్కకు వినతిపత్రాన్ని అందజేశారు.

స్పీకర్ క్యాంపు కార్యాలయంలో..

వికారాబాద్ : తాండూరు నియోజకవర్గంలో పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు తిరుగు ప్రయాణంలో వికారాబాద్ ఎమ్మెల్యే, స్పీకర్ క్యాంపు కార్యాలయానికి వచ్చారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆహ్వానం మేరకు వచ్చిన వారంతా తేనీటి విందు స్వీకరించి కాసేపు ముచ్చటించారు. స్థానిక నాయకులను డిప్యూటీ సీఎం, మంత్రిని స్పీకర్ పరిచయం చేశారు.

మక్కబుట్టలమ్మి ఎంత సంపాదిస్తావు?

స్వీట్‌కార్న్ వ్యాపారిని పలకరించిన భట్టి



మక్క బుట్టను పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

దారూరు: 'మక్క బుట్టల వ్యాపారంలో రోజుకు ఎంత సంపాదిస్తావు' అంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రోడ్డు పక్కనున్న మక్క బుట్టల వ్యాపారిని పలకరించారు. తాండూరు నియోజకవర్గంలో పర్యటించిన డిప్యూటీ సీఎం తిరుగు ప్రయాణంలో మంగళవారం సాయంత్రం దారూరు మండలం కేరెల్లి శివారులో ఆగారు. అక్కడ మక్క బుట్టలమ్ముతున్న దారూరుకు చెందిన ఎండీ చాంద్ వద్ద మక్క బుట్టలు కొని ఆతడితో మాట్లాడారు. కంకులు కాలుస్తున్న తీరును భట్టి పరిశీలిస్తూ.. వ్యాపారం ఎలా ఉంది? రోజుకు ఎంత సంపాదిస్తావు అని అడిగారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందిస్తామని చాంద్‌కు హామీ ఇచ్చారు. అనంతరం చాంద్ కోరిక మేరకు విక్రమార్క, ఫొటో దిగి వెళ్లిపోయారు.

బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి డిప్యూటీ సీఎం



ఆర్టీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి నివాసానికి మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐన్‌ఫర్ట్ మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా బుయ్యని నరశ్రీనివాస్‌రెడ్డి అతిథులకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు.



కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

విద్యార్థి దశలోనే క్రీడా శిక్షణ పొందాలి

శామీర్‌పేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, క్రీడాకారులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో శిక్షణ పొంది ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా ఆర్డీవో సమ్మయ్య జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తూంకుంటలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్స్‌లో అథ్లెటిక్స్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్‌తో కలిసి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాల నుంచి దూరంగా ఉండాలని, క్రీడల్లో ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. రాజశేఖర్ మాట్లాడుతూ.. ఆగస్టు నెల 3, 4 తేదీల్లో హనుమకొండలో 14వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీలకు మేడ్చల్ జిల్లా తరఫున 40మంది క్రీడాకారులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఆగస్టు 7న జనగామలో రాష్ట్ర స్థాయి జావలిన్ త్రో పోటీలు నిర్వహిస్తున్నట్లు, జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. కాగా మేడ్చల్ జిల్లా పోటీల్లో అండర్- 8, 10, 12, 14, 16, 18, 20 ఏజ్ గ్రూపుల నుంచి 500మంది క్రీడాకారులు పోటీల్లో తలపడ్డారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ నిర్వహణ కమిటీ జాయింట్ సెక్రటరీ రాజు, వైస్‌ప్రెసిడెంట్ అశోక్, టెక్నికల్ కమిటీ సభ్యులు శేఖర్, సునీల్, మల్లికార్జున్, భద్రం, మాణిక్యం, పీడీలు గోపాల్, ప్రభాకర్, శంకర్, పీఈటీలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



కేశంపేట: మాట్లాడుతున్న ప్రభారి పాపారావు

కేశంపేట/కొత్తూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలని బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా ప్రభారి పాపారావు పిలుపునిచ్చారు. కేశంపేటలో బీజేపీ మండల అధ్యక్షులు రోజు రాధిక అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అన్ని స్థానాల్లో పోటీ చేయాలన్నారు. కేశంపేట మండలంలో 12 ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ స్థానాల్లో బీజేపీ గెలిచేలా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, మండల ప్రభారి మహేందర్‌రెడ్డి, మండల కన్వీనర్ మహేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా ప్రభారి పాపారావు, కన్వీనర్ శ్రీరాములు యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. కొత్తూరులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అమరవరం నర్సింహగౌడ్, మండల శాఖ అధ్యక్షుడు అత్తాపురం మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంచాలి

ఆదిబట్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచి పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని కప్పాడు గ్రామంలో సర్వే నంబర్లు 121, 197, 200, 201, 206, 207, 252, 253, 254, 255లలో 98 ఎకరాల సీలింగ్ భూమిలో రైతులతో కలిసి ట్రాక్టర్‌తో దున్నారు. ఆయన మాట్లాడుతూ మిగులు భూములను ఓ భూస్వామి తన అధీనంలో పెట్టుకున్నాడని ఆరోపించారు. ఈ భూమిని గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు సాగు చేసుకుంటున్నారని వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో కలెక్టర్, నాయస్థానాలు దీనిని సీలింగ్ భూమిగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. కాస్తులో ఉన్న పేదలకు ఈ భూములపై పట్టాలు ఇవ్వాలన్నారు. అధికారులు పట్టించుకోకుంటే కప్పాడు నుంచి కలెక్టరేట్‌కు పాదయాత్ర చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, నాయకులు సామేల్, జాస్పర్, జగదీష్, జంగయ్య, రాంచంద్రయ్య, జగన్, బుగ్గరాములు, ఎల్లేష్, ప్రభుదాస్, విష్ణుష్, రాజశేఖర్, మహేష్, దాసు, ఇందిర, అరుణ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

జిల్లా వ్యవసాయాధికారి ఉష



మాట్లాడుతున్న డీఏవో ఉష

ఇబ్రహీంపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అవసరమైన ఎరువులు సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఉష అన్నారు. మంగళవారం మండలంలోని దండుమైలారం, పోల్కంపల్లి, రాయపోల్‌లోని ఎరువుల గోదాంలను పరిశీలించారు. ఏదిద సొసైటీల్లో 87 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, మరో రెండు రోజుల్లో వంద మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందన్నారు. ఈ సందర్భంగా దండుమైలారంలో ప్రకృతి వ్యవసాయం కింద ఎంపిక చేసిన రైతుల పొలాలను పరిశీలించారు. అనంతరం ముకునూరు రైతు వేదిక వద్ద రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. దండుమైలారం గ్రామాన్ని ప్రకృతి వ్యవసాయ క్లస్టర్ కింద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సేంద్రియ వ్యవసాయ పథకం అమలు తీరు బాగుందని, దీనిపై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయం కింద ఎంపికైన క్లస్టర్‌లో ఇద్దరు మహిళలను కృషి సఖిలుగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ఇబ్రహీంపట్నంలోని వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ సుజాత, మండల వ్యవసాయాధికారి విద్యాధరి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, సృజన, దండుమైలారం, పోల్కంపల్లి ప్యాక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూర్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కొత్తూర్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్దేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుకు లావణ్యదేవేందర్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. పలువురు కౌన్సిలర్లు ప్రజా సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. కొత్తగా ఏర్పడిన కొత్తూర్ మున్సిపాలిటీలోని సమస్యలన్నీ అంచలెంచెలుగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. సమావేశానంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.30కోట్లతో మునిసిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణాలు చేపట్టామన్నారు. మరో 10కోట్లు త్వరలోనే మంజూరవుతాయన్నారు. కొత్తూర్ కాకనుకుంట కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా బ్యూటిఫికేషన్ చేస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పార్టీలన్నీ కలిసి వస్తున్నాయని పేర్కొన్నారు. కొత్తూర్ పురపాలికను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు తన వంతు కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు మాదారం నర్సింహగౌడ్, కోస్గి శ్రీనివాస్, సోమనాయక్, చంద్రకళకొమురయ్యగౌడ్, ప్రసన్నలతయాదయ్య, మాధవిపోపాలగౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జెసునరసింగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు బిదేవేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ లో ఖాళీ ప్రవేశాలు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఎంపికైనా వారికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. విద్యార్థులు 31వ తేదీన ఉదయం 9 గంటలకు హాజరైంచి స్పాట్ అడ్మిషన్లకు అర్హులని ఒరిజినల్ సర్టిఫికెట్లు(కులం, ఆదాయం, పదో తరగతి మెమో) మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, 3 సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థుల నుంచి అప్లికేషన్లు మధ్యాహ్నం 1 గంటల వరకే తీసుకుంటారని తెలిపారు. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు అర్హుల జాబితాను ప్రదర్శిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తైక్వాండోలో అర్యన్‌కు బంగారు పతకం



పరిగి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాంపియన్‌షిప్-2025 రాష్ట్ర స్థాయి పోటీల్లో పరిగి విద్యార్థి ప్రతిభ చాటాడు. పరిగిలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న అర్యన్ తైక్వాండో జూనియర్ విభాగంలో గోల్డ్ మెడల్‌ను సాధించారు. నదుర్‌నగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పూంసే విభాగంలో ప్రతిభను చాటి బంగారు పతకాన్ని సాధించారు. కాగా, పాఠశాల యాజమాన్యం అతడిని అభినందించింది.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

వికారాబాద్, మేడ్చల్ జిల్లాలో నాగుల పంచమిని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు వేకువజాము నుంచే మున్సిపాలిటీ పరిధిలోని శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల వద్ద నాగుల పుట్టవద్ద భక్తులు పోటెత్తారు. గ్రామాల్లో నాగ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలకు కుంకుమ, పసుపు చల్లి, పూలు, గుడ్లు సమర్పించి పుట్టలో పాలుపోశారు. అదేవిధంగా శ్రావణమాస పూజలు కొనసాగుతున్నాయి.


వికారాబాద్: ఇందిరానగర్ నాగుల పుట్ట వద్ద భక్తులు


తాండూరు: పుట్టలో పాలు పోస్తున్న బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు సాహు శ్రీలత


మర్పల్లి: సిరిపురంలో పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న చిన్నారులు


ఘట్‌కేసర్: నాగుల పంచమి సందర్భంగా ఘట్‌కేసర్‌లోని నాగులమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న మహిళలు


ఘట్‌కేసర్ రూరల్: మర్రిపల్లిగూడలో పుట్టలో పాలుపోస్తున్న మహిళలు


ధారూరులో మహిళల పూజలు


నవాబుపేట: నాగదేవతలకు మహిళల పూజలు


దోమ: నాగదేవత విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న తహసీల్దార్ గోవిందమ్మ

శామీర్‌పేట ఏటీసీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

శామీర్‌పేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని ప్రభుత్వ అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్(ఏటీసీ)లో ప్రవేశానికై అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ లలిత తెలిపారు. ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికై ఏటీసీలో ప్రవేశించి టెక్నికల్ విద్యను అభ్యసించడానికై అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. తమ కళాశాల సెంటర్‌లో మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నీషియన్, హర్టిసన్ యసంగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బెసిక్ డిజైనర్ అండ్ విర్చియల్ వెరిపయ్యార్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సుల్లో ఉన్నట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు. ఈ కోర్సుల్లో చేరేందుకై 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఈ కోర్సుల్లో చేరేందుకై అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు.

బ్రిడ్జిపై కొనసాగుతున్న మరమ్మతులు


బ్రిడ్జిపై మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

యాలాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తాండూరు-కొడంగల్ మార్గంలోని కాగ్నా నదిపై నిర్మించిన బ్రిడ్జి మధ్యలో పడిన రంధ్రానికి మరమ్మతులు కొనసాగుతున్నాయి. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాలతో ఇంతకుముందు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మంగళవారం మరమ్మతులు ప్రారంభించారు. నాణ్యతతో పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

పేద రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

యాలాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేద రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కేవీపీఎస్, దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దౌలాపూర్‌లో మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేసిన శిలాఫలకం ఎదుట కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు.బుగ్గప్ప మాట్లాడుతూ.. యాలాల మండలం చెన్నారంకు చెందిన తాళ్లపల్లి అశోక్ సర్వేనెంబర్-73, విస్తీర్ణం 1.20 గుంటల భూమిని, దౌలాపూర్ రెవెన్యూ పరిధిలోని 73/5/3 విస్తీర్ణంలో రెండెకరాల భూమిని ప్రభుత్వం 50ఏళ్ల కిందట దళిత కుటుంబాలకు సాగు చేసుకునేదుకు రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇచ్చిందని తెలిపారు. అట్టి భూమిలో కనీసం రైతులకు సమాచారం ఇవ్వకుండా తహసీల్దార్ జేసీబీలతో తవ్వి శిలాఫలకాలు ఏర్పాటు చేయించారన్నారు. తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొనగిరి వెంకటమ్మ, కొనగెరి రాములమ్మ, కొనగెరి చంద్రప్ప, కొనగెరి మాధరప్ప, సిద్ధు పాల్గొన్నారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

కొడంగల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలుర) కొడంగల్‌లో 2025-2026 విద్యాసంవత్సరానికి ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీలో సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామదాసు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31న కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 31న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

పరిగి: పరిగిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో ఎంపిసీ-1లో ఎస్సీలకు 20సీట్లు, బీసీలకు రెండు, ఓసీలకు ఒకటి, మైనార్టీలకు ఒకటి ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ థామస్ తెలిపారు. ఈనెల 31వ తేదీన ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లోని క్లైట్ కళాశాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఈ నెల 31వ తేదీన ఒకేషనల్ కోర్సులకు స్పాట్ అడిషన్స్ జరుగనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్, టీజీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐ జిల్లా కో-ఆర్డినేటర్ వేణుగోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మేడ్చల్, కిష్టాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఎస్సీ కేటగిరిలో ఎంపీసీ గ్రూప్‌లో నాలుగు సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. పెద్ద పర్వతాపూర్, శామీర్‌పేట్ గురుకుల బాలుర కళాశాలలో స్పాట్‌అడ్మిషన్స్ జరుగుతాయని తెలిపారు.

పూడూరు: మండలంలోని ఎన్కెపల్లి తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ సరళ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 30 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు టీసీ, బోనఫైడ్, ఆధార్ కార్డుతో విద్యార్థులు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

కాలనీలో తాగునీటి తిప్పలు

ధారూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ధారూరులోని వడ్డెర కాలనీలోని ప్రజలు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. వారం రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవటం, కట్టెల మిషన్ ఎదురుగా ఉన్న బోర్ మోటార్ చెడిపోవటంతో తాగునీటికి అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు. కాలనీకి మిషన్ భగీరథ నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పీఎం అటల్ టింకరింగ్, లైబ్రరీ గదుల నిర్మాణానికి శంకుస్థాపన

దోమ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దాదాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పీఎం అటల్ టింకరింగ్, లైబ్రరీ గదుల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకట్ ఉపాధ్యాయులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నూతన విద్యావిధానానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం శ్రీ పాఠశాలకు జిల్లా పరిషత్ దాదాపూర్ పాఠశాల ఎంపికైన విషయం తెలిసిందే.

ఐదు తరగతులకు ముగ్గురే విద్యార్థులు


దీప్లనాయక్ తండా పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు జైపాల్‌రెడ్డి

కులకచర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దీప్లనాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులు ఉండగా ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అందులోనూ ఇద్దరు విద్యార్థులు కొద్దిరోజులుగా పాఠశాలకు రావడంలేదు. ఉన్న ఒక్క విద్యార్థిని మాత్రమే పాఠశాలకు వస్తోంది. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' పాఠశాలను సందర్శించగా ఉపాధ్యాయుడు జైపాల్‌రెడ్డి ఒక్క విద్యార్థిని పల్లవికి పాఠాలు బోధిస్తూ కనిపించారు. పాఠశాలలో 1, 2 తరగతుల్లో విద్యార్థులు లేరు. 3వ తరగతిలో పల్లవి, నిఖిల్, 5వ తరగతిలో శృతి బడికి వస్తున్నారు. వీరిలో పాఠశాలకు రాని ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడగా పాఠశాలకు పంపిస్తామని చెప్పారని ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ తండా నుంచి నిత్యం ఇతర ప్రాంతాల ప్రైవేట్ పాఠశాలకు 10మంది విద్యార్థులు ఐదో తరగతిలోపు వారు వాహనాల్లో వెళ్లి రావడం గమనార్హం. తండా ఈసారి కొత్తగా పంచాయతీగా ఏర్పడింది. తండాలో 550మంది జనాభా ఉండగా ఓటర్లు 395మంది ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

దీప్లనాయక్ తండా ప్రాథమిక పాఠశాల ముందు తీసిన గుంతలతో ప్రమాదం పొంచిఉంది. తండావాసులు పాఠశాల ముందు ఉన్న కమ్యూనిటీ భవనం కూల్చి సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి గత ఆరు నెలల కిందట గుంతలు తీసి వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరుచేరి ప్రమాదకరంగా మారాయి. ఈ విషయంపై ఎంఈవో హబీబ్ అహ్మద్‌ను వివరణ కోరగా తండావాసులతో మాట్లాడి ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పాఠశాల ఎదుట ఆలయ నిర్మాణానికి తీసిన గుంతలు

ప్రజల వద్దకు కాంగ్రెస్

(ఐదో పేజీ తరువాయి)

గాంధీ చౌక్ వరకు పది కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల అమలు గురించి క్షేత్రస్థాయిలో ప్రజల స్పందన గురించి తెలుసుకుంటారు. రంగాపూర్ నుంచి పరిగిలోని బహార్‌పేట్ చౌరస్తా వరకు పాదయాత్రగా వస్తారు. అక్కడి నుంచి గాంధీచౌక్ వరకు చేరుకుని అక్కడ మాట్లాడుతారు. అక్కడి నుంచి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పార్థసారథి ఇంట్లో డిన్నర్ ముగించుకుని అక్కడే నిద్ర చేస్తారు. మరుసటిరోజు ఆగస్టు ఒకటిన ఉదయం పరిగి శివారులో కొత్త నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో శ్రమదానం చేస్తారు. అక్కడి నుంచి పరిగిలోని ఎస్ గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా పార్టీ శ్రేణులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారు. ప్రభుత్వం పథకాల అమలు-ప్రజల స్పందన గురించి కార్యకర్తలతో తెలుసుకుంటున్నారు. పీసీసీసీ చీఫ్ మహేశ్‌తోపాటు, ఇంచార్జి మీనాక్షినటరాజన్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్‌లు, మాజీ చైర్మన్‌లు పాల్గొంటారు. అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా పర్యటనకు వెళ్తారు. ప్రజలకు వద్దకు కాంగ్రెస్ కార్యక్రమం నేపథ్యంలో పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు అందుకు సంబంధించి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

విజయవంతం చేయాలి: డీసీసీ అధ్యక్షుడు

టీపీసీసీ చేపట్టిన ప్రజల వద్దకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. మంగళవారం సాయంత్రం పరిగిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే టీపీసీసీ పరిగి నుంచి శ్రీకారం చుట్టడం పరిగి ప్రజలు అదృష్టంగా భావించాలన్నారు. భారత రాజ్యాంగాన్ని చులకనచేస్తున్న బీజేపీ ఆగడాలను ఎండగట్టేందుకే కాంగ్రెస్ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ఇచ్చిన హామీకి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమానికి పరిగి నియోజవవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన శ్రేణులను కోరారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

దుద్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో విజయరామారావు అన్నారు. మండలంలోని ఈర్లపల్లి, సంద్రకుంట తండా పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంద్రకుంట తండా పాఠశాల భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్, సీఆర్పీ రాందాస్ పాల్గొన్నారు.

మర్పల్లి: విద్యార్థులకు అందించే భోజనం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంఈవో అంజిలప్ప అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తులసి, జయరాం పాల్గొన్నారు.

పరిగి: పాఠశాలలకు సంబంధించి అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పరిగి ఎంఈవో గోపాల్ సూచించారు. పరిగిలో మంగళవారం జరిగిన హెచ్‌ఎంల సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ, డిజిటల్ స్క్రీన్‌లో ప్రతి పాఠశాల గురించి ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, వర్క్‌బుక్స్ వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయించాలని సూచించారు.

ఎరువు నిల్వల తనిఖీ

ధారూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల విక్రయ కేంద్రాల్లో మంగళవారం వికారాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటేశం ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ధారూరు, హరిదాసుపల్లి పీఏసీఎస్, మన గ్రోమోర్, మోమిన్‌కుర్దులోని ఎరువుల విక్రయ కేంద్రాల్లో ఎరువుల నిల్వలు, అమ్మకానికి సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించారు. మున్నూర్‌సోమారంలో ఎరువులు వేస్తున్న పత్తి పొలాన్ని ఆయన పరిశీలించారు.

జంగయ్యను జైలుకు పంపడం అప్రజాస్వామికం

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్


జంగయ్యను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్యను జైలుకు పంపడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే నివాసంలో జైలు నుంచి వచ్చిన జంగయ్యను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్‌పై దుష్ప్రచారం చేస్తున్న టీవీ ఛానల్ వద్ద శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్లిన వికారాబాద్ జైదుపల్లి గ్రామ వాసి బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్యను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. 22రోజుల పాటు చంచల్‌గూడ జైలులో ఉంచడం అతడి అరెస్ట్‌కు సంబంధించిన సమాచారం కుటుంబసభ్యులకు గానీ సన్నిహితులకు గానీ తెలపకుండా గోప్యంగా ఉంచడం, టాస్క్‌ఫోర్ పోలీసులు అతడిపై దాడి చేయడం అమానుషమైన చర్యలని అన్నారు. పక్షపాత ధోరణితో వ్యవహరించే జర్నలిజాన్ని, వారిని ప్రోత్సహించే ప్రభుత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి

బొంరాస్‌పేట్: ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని ఎంఈవో హరిలాల్ అన్నారు. బొంరాస్‌పేట్‌లో మంగళవారం దివ్యాంగ చిన్నారులకు వైద్యురాలు నవనీత, ఐఈఆర్‌పీ వేణుగోపాల్ ఫిజియోథెరపీ సేవలు నిర్వహించారు. అదేవిధంగా దివ్యాంగ చిన్నారులకు రెండు ట్రై సైకిళ్లు, మూడు సీపీ చైర్స్ అందజేశారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత

బొంరాస్‌పేట్: మండలంలోని తుంకిమెట్లలో మంగళవారం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లను పెంచాలి

బొంరాస్‌పేట్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులు, వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలకు ఆసరా పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి ప్రవీణ్, ప్రకాశ్, నర్సింగ్‌రావు అన్నారు. మెట్లకుంటలో మంగళవారం వారు ఆసరా పింఛన్‌దారులతో సమావేశం నిర్వహించారు. వచ్చేనెల 2వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ కొడంగల్ పట్టణంలోని మురారి ఫంక్షన్ హాల్‌లో జరిగే సన్నాహక సదస్సుకు హాజరు కానున్నట్లు తెలిపారు.

సన్న వడ్లకు బోనస్ చెల్లించాలి

దోమ: సన్నవడ్లకు బోనస్ చెల్లించాలని దోమ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత రబీ సీజన్‌లో రైతులు పండించిన సన్నరకం ధాన్యాన్ని సేకరించేందుకు మోత్కూర్, దిర్సంపల్లి గ్రామాల రైతులకు 13,600 క్వింటాళ్లకు సంబంధించిన బోనస్ డబ్బులు అందించాలన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు కృషి

కులకచర్ల: మండలంలో బాలికల ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. కులకచర్ల విజయచంద్ర ఫంక్షన్ హాలులో మంగళవారం పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యావసరుల అభివృద్ధికి అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ మొగులయ్య, బీజేపీ జిల్లా నాయకులు వెంకటయ్యగౌడ్, సౌమ్యారెడ్డి, జానకిరామ్, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, ఎంఈవో హబీబ్ అహ్మద్, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

యాలాల: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, మంగళవారం డిప్యూటీ సీఎం కు విజ్ఞప్తి చేశారు. మండలంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి గత ప్రభుత్వం ఎకరా భూమి, రూ.50లక్షల నిధులు నిధులు మంజూరు చేసినా ఇప్పటి వరకు శిలాఫలకానికే పరిమితమైందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న శివసాగర్ ప్రాజెక్టు పూర్తిచేయాలని, పైచదువులకు ఇతర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లకుండా స్థానికంగా జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని కోరారు.

బ్యాండ్ సామగ్రి అందజేత

నవాబుపేట: పులుమామిడికి చెందిన రవీందర్‌రెడ్డి నవాబుపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం బ్యాండ్ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో అబ్దుల్ రహెమాన్ రవీందర్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాడల్ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

దోమ: అయినాపూర్ గ్రామంలో మంగళవారం బీజేపీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మండల ఇంచార్జ్ పెంటయ్యగుప్త మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీత్వ బాల్‌రాజ్, శేరి రాంరెడ్డి, నర్సింహులు, అశోక్ పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

చౌడాపూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట: మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. ఆ ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆలయం తరపున గౌడసంఘం ఆధ్వర్యంలో పలువురు భక్తుల సాయంతో అన్నదానం చేశారు.

పేదలకు వైద్యసేవలందించడమే మెడిసిటీ ధ్యేయం

శామీర్‌పేట: మూరుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి పేద, నిరుపేదలకు ఉచితంగా వైద్యసేవలందించడమే మెడిసిటీ ఆస్పత్రి ధ్యేయమని డాక్టర్ దీప్తి అన్నారు. అలియాబాద్ గ్రామంలో మంగళవారం ఘనపూర్ మెడిసిటీ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు దీప్తి, ప్రీతి, సారిక, సీజా 185మంది రోగులను వైద్యులు పరీక్షించారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ ఆస్పత్రి నర్సులు త్రివేణి, రజనీకాంత్, ఫార్మాసిస్ట్ కావ్య, మార్కెటింగ్ ప్రతినిధులు సత్యనారాయణ, నాగార్జున, బాలకృష్ణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

ఘట్‌కేసర్ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలు నిద్రపోతుండగా ఇద్దరు దుండగులు పుస్తెల తాడు లాక్కొని పరారయ్యారు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. జక్కుల ప్రసాద్ సతీమణి జక్కుల సుధా మంగళవారం ఉదయం హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ రైలు నాంపల్లిలో ఎక్కి కాగజ్‌నగర్‌కు బయల్దేరారు. ఉదయం 7గంటలకు రైలు ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధి ఎన్‌ఎఫ్‌సీనగర్‌కు రాగా రైలు వేగం తగ్గింది. ఈ క్రమంలో ఇద్దరు దుండగులు నిద్రపోతున్న జక్కుల సుధా మెడలో నుంచి 3.9గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని రైల్లో నుంచి దూకి పరారయ్యారు. సుధాఆయన భర్త ప్రసాద్ తెరుకునేలోపు చెట్లపొదల్లో నుంచి పారిపోయారు. బాధితులు రైల్వేపోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భర్త నుంచి భార్యను దూరం చేసిన మాజీ ప్రియుడు

- తనను పెళ్లి చేసుకోవాలని వివాహిత నిరసన

తాండూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తన భర్త నుంచి దూరం చేసిన మాజీ ప్రియుడు తనను వివాహం చేసుకోవాలంటూ ఓ వివాహిత నిరసన వ్యక్తం చేసింది. తాండూరు మండలం ఓ గ్రామానికి చెందిన ఓయువతి అదే గ్రామానికి చెందిన యువకుడు ఏడేళ్ల ప్రేమించుకున్నారు.వీరి వివాహానికి కుటుంబ సభ్యుల అంగీకరించకపోవడంతో యువతి పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకుంది. మాజీ ప్రియుడు తరచూ ఫోన్లు చేయడం, మెసేజ్ చేయడంతోపాటు యువతి భర్తకు నేరుగా ఫోన్‌చేసి వారి ప్రేమ వ్యవహారాన్ని వివరించాడు. ఇది జీర్ణించుకోలేని భర్త తన భార్యను పుట్టింటికి పంపించాడు. దీంతో ఆమె తల్లిదండ్రుల వద్దనే ఉండిపోయింది. ప్రియుడిని తనను వివాహం చేసుకోవాలని ఆ యువతి కోరగా అంగీకరించపోవడంతో పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. తన ప్రియుడు తనను శారీరకంగా వాడుకుని ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని కోరితే అంగీకరించడం లేదని ఆమె వాపోయింది. దీంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు యువతి తల్లిదండ్రులు తెలిపారు. ఇదే విషయమై కరన్‌కోట్ ఎస్ఐ వినోద్‌ను వివరణ కోరగా పోలీసుస్టేషన్‌కు యువతి వచ్చిన విషయం వాస్తవమేనని, కానీ రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.

ఫోర్జరీ కేసులో వ్యక్తికి మూడేళ్లు జైలు

కొడంగల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నకిలీపత్రాలు సృష్టించి భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు యత్నించిన కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ స్థానిక మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి శ్రీరామ్ తీర్పునిచ్చారు. ఎస్ఐ జీవీ.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. 2015లో కొడంగల్ మండలంలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన జైనుద్దీన్‌కు సంబంధించిన సర్వే నంబర్ 297లో 38గుంటలు, సర్వేనంబర్ 41లో 11గుంటలు మొత్తం ఎకరా 9 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన జీడీ మల్లేశం నకిలీ పత్రాలు సృష్టించి కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చాడు. ఈ క్రమంలో పత్రాలను పరిశీలించిన అప్పటి తహసీల్దార్ రవికుమార్ అవి నకిలీవిగా గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ కే.సత్యనారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు అనంతరం చార్జిషీట్‌ను కొడంగల్ మున్సిఫ్‌కోర్టులో అందించగా మంగళవారం కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరస్తుడు జీడీ మల్లేశంకు మూడేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ జీవీ.సత్యనారాయణ తెలిపారు.

బషీరాబాద్ మాజీ సర్పంచ్ కన్నుమూత



బషీరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మాజీ సర్పంచ్, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాస్‌పర్తాని(90) సోమవారం రాత్రి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంట్లో కన్నుమూశారు. ఆయన కుటుంబం కొన్నేళ్ల కిందట వ్యాపారం నిమిత్తం తాండూరు పట్టణానికి వచ్చి ఇక్కడా స్థిరపడింది. సర్పంచ్‌గా మూడు పర్యాయాలు ఆయన ఏకగ్రీవంగా ఎన్నికై ప్రజలకు సేవలందించారు. మాజీ సర్పంచ్ మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి, పలువురు వ్యాపార ప్రముఖులు పలువురు నివాసానికి చేరుకుని నివాళులర్పించారు.

ఘట్‌కేసర్ సీఐగా బాలస్వామి



ఘట్‌కేసర్ రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ సీఐగా బాలస్వామి నియమిస్తూ రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన పందిరి పరశురాం రాచకొండ కమిషరేట్ స్పెషల్ బ్యాంచ్‌కు బదిలీ అయ్యారు. బాలస్వామి మేడిపల్లి పోలీసుస్టేషన్‌లో డీఐగా పనిచేసి ఘట్‌కేసర్ సీఐగా బదిలీపై వచ్చారు.

కీసర సీఐ బదిలీ

కీసర రూరల్: కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన కే.శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భువనగిరి స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ.ఆంజనేయులు కీసర ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చారు. కీసర ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్ ఎస్‌ఓటీ విభాగానికి బదిలీపై వెళ్లారు. నేడు ఆంజనేయులు కీసర ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలి


అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వికారాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారంవికారాబాద్ పట్టణ 14, 22, 23 వార్డులకు సంబంధించిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి ఆయా వార్డులకు సంబంధించి వార్డు కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, రామస్వామి, కిరణ్ పటేల్, సురేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

దుద్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లగచర్ల ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ వి.రామసుబ్రహ్మణ్యన్‌ను మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లగచర్ల రైతులు, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, శ్రవణ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పరిగి,జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పరిగి మున్సిపల్ కమిషనర్ వెకంటయ్య సూచించారు. పట్టణాల్లో వంద రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం పరిగి మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో మత్తు పదార్థాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథం, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.